ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 22.12.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు వివిధ ప్రాంతాల్లో ఈరోజు జరుగుతున్నాయి.
2. కృష్ణా, గోదావరి జలాలపై శాసనసభలో చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్ష నేతగా చంద్రశేఖరరావు అంగీకరిస్తే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.
3. వచ్చే నెలలో జరిగే మేడారం మహాజాతరకు హాజరుకావాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును పలువురు రాష్ట్ర మంత్రులు ఆహ్వానించారు.
4. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో చలితో పాటు పొగమంచు కమ్ముకుంటోంది. మరో మూడు రోజుల పాటు చలి తీవ్రత ఇలాగే కొనసాగుతుందని వాతావరణ విభాగం తెలియజేసింది.

ప్రమాణం

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికైన కొత్త సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ ప్రమాణస్వీకారం ఈరోజు జరుగుతోంది. ఈ మేరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 11, 14, 17 తేదీల్లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 1,205 ఏకగ్రీవాలు, 11వేల 497 ప్రాంతాల్లో ఎన్నికలు జరిగిన పంచాయతీ స్థానాలు కలిపి మొత్తం 12వేల 702 మంది సర్పంచులు కొత్తగా ఎన్నికయ్యారు. వార్డు సభ్యుల్లో 25వేల 848 మంది ఏకగ్రీవం కాగా 85వేల 955 వార్డులకు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా ఒక లక్షా 11వేల 803 మంది వార్డు సభ్యులుగా గెలిచారు. మూడు విడతల వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం 12వేల 702 మంది ఉప సర్పంచులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నమూనాలో వీళ్లందరి ప్రమాణస్వీకారాలు జరుగుతున్నాయి.

జీఎస్

రేవంత్

కృష్ణా, గోదావరి జలాలపై అవసరమైతే రెండేసి రోజుల చొప్పున శాసనసభలో చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చంద్రశేఖరరావు అంగీకరిస్తే వచ్చేనెల 2వ తేదీ నుంచే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తన నివాసంలో ఆయన నిన్న సాయంత్రం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సభకు వస్తానని కేసీఆర్ చెప్పకపోయినా... జనవరిలో అసెంబ్లీ శీతాకాల సమావేశాల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో చర్చించి తేదీలు నిర్ణయిస్తామన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించాలని చంద్రశేఖరరావు అడుగుతుంటే బహిరంగ సభలకు వెళ్తానంటున్నారని, బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేతలా శాసనసభకు వచ్చి చర్చించాలని కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు.

డెస్క్

ముర్ముకు ఆహ్వానం

వచ్చే నెలలో జరిగే మేడారం మహాజాతరకు హాజరుకావాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆహ్వానించారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో నిన్న రాష్ట్రపతిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. రాష్ట్రపతికి సమ్మక్క తల్లి చీర, కంకణం, కండువా, బంగారాన్ని అందజేశారు. మేడారం మహాజాతర విశేషాలను.. సమ్మక్క, సారలమ్మ తల్లుల వీరగాథలను వివరించారు. జాతరకు వచ్చేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్రపతి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులకు రాష్ట్రపతి నూతన వస్త్రాలను బహూకరించారు.

పీఎస్

మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ పథకం కింద ఉచితంగా బస్సులలో ప్రయాణం చేసే మహిళలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఆర్టీసీ, బీసీ సంక్షేమశాఖలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్‌కి 2వేల 800, నిజామాబాద్, వరంగల్ పట్టణాలకు 100 విద్యుత్ బస్సులు వస్తున్నాయని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు, షూస్ పంపిణీకి నిధుల విడుదలలో ఇబ్బందులు లేకుండా ఆర్థికశాఖ చూడాలన్నారు.

డెస్క్

ఉత్తమ్

పదేళ్ల చంద్రశేఖరరావు పాలనలోనే నదీ జలాల హక్కులు, నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో నిన్న సాయంత్రం విలేకరులతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. చంద్రశేఖరరావు ఆరోపణలను

తిప్పికొట్టారు. దాదాపు రెండు లక్షల కోట్లు ప్రాజెక్టులపై ఖర్చు చేసి ఒక్క ఎకరానికీ కొత్తగా సాగునీరు ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టులకు 88 వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చారని అన్నారు. అప్పుడు చేసిన అప్పులకు ఏటా 16 వేల కోట్ల రూపాయలు వడ్డీలు, కిస్తీలకు తమ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోందని మంత్రి విమర్శించారు.

డెస్క్

గొర్రెలు

నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాలలో గొర్రెలు, మేకలకు ఈరోజు నుంచి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.జ్ఞాన శేఖర్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

(బైట్ - జ్ఞాన శేఖర్)

పిటిసి నాగర్ కర్నూల్

DPD:

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పబ్లికేషన్స్ డివిజన్ (Publications Division) ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ (PDG) భూపేంద్ర కైంతోలా హైదరాబాద్ లోని ప్రచురణల విభాగం కార్యాలయంలో నాలెడ్జ్ కార్నర్ ను ప్రారంభించారు. DPD ప్రచురిస్తున్న పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉండాలనీ, నాలెడ్జ్ కార్నర్ అందుకు దోహదపడుతుందనీ చెప్పారు. ఈ మాదిరి ప్రయత్నాలు అన్నిరాష్ట్రాలలో ఏర్పాటు కావాలనీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన సమాచార ప్రసారా శాఖ IIS అధికారులతో సమావేశం అయ్యారు.

MSL

మేళా

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో 38వ పుస్తక ప్రదర్శన అ ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ ప్రదర్శనను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పబ్లికేషన్స్ డివిజన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ భూపేంద్ర కైంతోలా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర

మీడియా విభాగానికి చెందిన ప్రత్యేక స్టాల్‌ను సందర్శించి, అక్కడ ఉన్న వివిధ ప్రచురణలను పరిశీలించారు.

ptc, hyd

వాతావరణం

రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. చలితో పాటు పొగమంచు కమ్ముకోవడంతో ఉదయం 9 గంటలైనా ఇళ్ల నుంచి బయటకు రాకపోయారు. చాలా ప్రాంతాల్లో ఏక సంఖ్యలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీలు, ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 7.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

పీఎస్

హాకీ

హాకీ ఇండియా లీగ్ లో పాల్గొంటున్న హైదరాబాద్ తూఫాన్స్ హాకీ జట్టు తెలంగాణ రాష్ట్రానికి పర్యాటక, సాంస్కృతిక రాయబారులుగా నిలవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిన్న హైదరాబాద్ లో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 'తెలంగాణ క్రీడా విధానం–2025' ద్వారా రాష్ట్రంలో క్రీడా విప్లవం తీసుకొస్తున్నామని, త్వరలో ఏర్పాటుకానున్న స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గౌరవం తీసుకొస్తామని తెలిపారు.

జీఎస్

ఫెస్టివల్

హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగిన హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిన్న ముగిసింది. ముగింపు కార్యక్రమంలో విజేతల పేర్లను ప్రకటించారు. ఇరాన్‌కు చెందిన 'సంవేష్ట్' చిత్రానికి మొదటి బహుమతి లభించగా, ఈశాన్య భారతానికి చెందిన 'టాయ్ గన్' రెండో బహుమతి సాధించింది. 'మై ఫాదర్ ఈజ్ అఫ్రెయిడ్ ఆఫ్ వాటర్' మూడో బహుమతి

గెలుచుకుంది. సమకాలీన సినిమా సవాళ్లపై జరిగిన చర్చా వేదికలో సృజనాత్మక స్వేచ్ఛ, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ ప్రభావంపై ప్రముఖులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జీఎస్

మేళా

రైతులు, మహిళా సంఘాలు, గ్రామీణ ప్రజల ఆర్థిక ప్రగతిని కాంక్షిస్తూ కరీంనగర్ వేదికగా మరోసారి భారీ ఎత్తున కిసాన్ గ్రామీణ మేళా ను నిర్వహిస్తున్నట్లు కిసాన్ జాగరణ్ అధ్యక్షులు సుగుణాకర్ రావు తెలిపారు.  కరీంనగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

(బైట్ - పోల్సాని సుగుణాకర్ రావు.  అధ్యక్షులు, కిసాన్ జాగరణ మేళా)

పిటిసి కరీంనగర్

ప్రమాదం

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఈ రోజు తెల్లవారుజామున బొలెరో వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. మరో 13 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి 23 మంది కూలీలు వ్యవసాయ పనుల కోసం బొలెరో వాహనంలో వస్తుండగా ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పిటిసి మంచిర్యాల